సాక్షి మంచిర్యాల

మంగళవారం : 25 : జూన్ : 2024



పొలాల్లో మృత్యుపాశాలు

పొలాల్లో ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలతో ఎక్కడో ఓ చోట మూగజీవాలు చనిపోతున్నాయి. రైతులు ప్రమాదాలకు గురవుతున్నా అధికారులకు పట్టింపు లేదు. 8లో▸



ఐటీడీఏ ఎదుట ఆదివాసీల ధర్నా

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీలు కదం తొక్కారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి భారీగా తరలివచ్చి ఐటీడీఏ ఎదుట ధర్నా చేపట్టారు. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34.0 /28.0

ఉదయం వేళ ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రివేళ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తరం దిశగా గాలులు వీస్తాయి.

మా వల్ల కాదు..!



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి రెఫర్ చేసిన వారిని 108లో పంపిస్తున్న దృశ్యం

- జీజీహెచ్ నుంచి వందల కేసులు రెఫర్
- యాక్సిడెంటు, పాయిజన్ కేసులు వరంగల్, హైదరాబాద్‌కు..
- హైరిస్క్ ప్రెగ్నెంట్ కేసులూ అక్కడికే..
- సాధారణ వైద్యం మాత్రమే అందుబాటులో..

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో పూర్తి స్థాయి వైద్యం అందని దుస్థితి నెలకొంది. ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఈ ఆస్పత్రి కొనసాగుతోంది. అన్ని విభాగాలకు చెందిన వైద్యులు ఉన్నా వైద్య సేవలు అందకపోవడం రోగులను ఆందోళనకు గురి చేస్తోంది. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఇలా 50మందికి పైగా అన్ని విభాగాల వైద్యులు ఉన్నా సాధారణ వైద్యం మాత్రమే అందిస్తున్నారు. యాక్సిడెంట్లు, పాయిజన్ కేసులు, నెలలు నిండక ముందే ప్రసవం అయ్యే కేసులన్నీ వరంగల్‌లోని ఎంజీఎం, హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ, నీలోఫర్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. ప్రతీ నెల 70కి పైగా క్రిటికల్ కేసుల పేరిట రెఫర్ చేస్తుండగా.. వారందరినీ 108 అంబులెన్స్‌లోనే పంపిస్తున్నారు. దీంతో అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉండాల్సిన 108.. రెఫర్‌ల పేరిట వరంగల్, హైదరాబాద్‌కు వెళ్లడం ఇబ్బందిగా మారుతోంది. వైద్యులు ఉన్నా వైద్యం అందించేందుకు సదుపాయాలు కల్పించకపోవడంతోనే కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు ప్రధాన ఆస్పత్రిగా ఉన్న మంచిర్యాల జీజీహెచ్ కేవలం సాధారణ వైద్యానికే పరిమితం అవుతోంది.

108 వాహనాల్లోనే..

యాక్సిడెంట్లు, ఆత్మహత్యాయత్నం, ఇతర అత్యవసర సమయాల్లో రోగులను ఆస్పత్రికి తీసుకొస్తుండగా.. ప్రథమ చికిత్స అనంతరం వరంగల్, హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నారు. వీరిని 108 వాహనంలోనే తరలిస్తున్నారు. ఎంపీ నిధులతో అన్ని సదుపాయాలు కలిగిన అంబులెన్స్‌ను ఆస్పత్రికి ఇచ్చినా వినియోగించకపోవడంతో షెడ్డుకే పరిమితమైంది. అత్యవసర సమయంలో ఇక్కడ 108 వాహనం అందుబాటులో ఉండకపోవడంతో పక్కనే ఉండే మండలాలకు చెందిన వాహనాలను వినియోగించాల్సి వస్తోంది. జిల్లాలో 18 మండలాలు ఉండగా, హాజీపూర్, తాండూర్, భీమిని, భీమారం మండలాలకు 108 వాహనాలు లేవు. మిగతా మండలాలకు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. నాలుగు మండలాలకు పక్కనే ఉన్న ఇతర మండలాలకు చెందిన వాహనాలను సర్దుబాటు చేస్తుండగా, రెఫర్ కేసులను 108 వాహనంలో తరలించడంతో ఇతర మండలాలకు చెందిన వాహనాల మీదే ఆధారపడాల్సి వస్తోంది.

భవనమే అసలు సమస్య

గతంలో వంద పడకల ఆస్పత్రిగా ఉండగా.. సామర్థ్యాన్ని 200 పడకలకు పెంచారు. కానీ అందుకు తగినట్లుగా వార్డులు, ఆపరేషన్‌కు సరిపడా థియేటర్లు లేవు. వర్షాకాలంలో భవనం స్లాబు నుంచి వర్షపు నీరు గదుల్లోకి వస్తోంది. స్లాబ్ పెచ్చులూడి కింద పడుతున్నాయి. గోడలు వర్షపు నీటికి తడిసి గదుల్లోకి తేమ వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూ వార్డులు కొనసాగించడం ఆస్పత్రి నిర్వాహకులకు ఇబ్బందిగా మారుతోంది. గతంలో ఇదే ఆస్పత్రిలో రోజుకు పదికి పైగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించగా.. గత కొంతకాలంగా శస్త్రచికిత్సలు నిలిపివేశారు. శస్త్రచికిత్సలు చేసేందుకు కేటాయించిన గదులు అనుకూలంగా లేకపోవడంతోనే నిలిపివేసినట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు చేయడంతో అన్ని విభాగాలకు సంబంధించిన వైద్యులు అందుబాటులో ఉన్నా ప్రత్యేకమైన వార్డులు, శస్త్రచికిత్సలు చేసేందుకు సరైన సౌకర్యాలు లేవు. దీంతో వైద్యులు ఓపీకి పరిమితం అవుతుండగా, పరికరాలు వృథాగా మారుతున్నాయి. నూతన ఆసుపత్రి భవన నిర్మాణం కాలేజీరోడ్డులోని మార్కెట్ యార్డులో చేపట్టగా, అది పూర్తయ్యేందుకు కనీసం ఏడాదికి పైగా సమయం పట్టే అవకాశం ఉంది. నూతన భవనం పూర్తయితేనే, ప్రతీ విభాగానికి సంబంధించిన వార్డుల కేటాయింపు, శస్త్రచికిత్సలు చేసేందుకు గదుల కేటాయింపు జరిగేందుకు అవకాశం ఉంది. ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించాలని పలువురు కోరుతున్నారు.

గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది మే నెల వరకు రెఫర్ చేసిన కేసులు

ఏడాది	అడ్మిషన్లు	రెఫర్‌లు
2023	29,607	1,082
2024 మే వరకు	13,451	439

అత్యవసర కేసులనే పంపిస్తున్నాం



ఆసుపత్రికి వచ్చే కేసుల్లో అత్యవసరం అయితేనే ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నాం. యాక్సిడెంట్ కేసులు, హైరిస్క్ ప్రెగ్నెంట్‌కు సంబంధించిన వాటిలో ఇబ్బందిగా ఉండే వాటిని రెఫర్ చేయాల్సి వస్తోంది. ఆసుపత్రి భవనం పాతగా కావడం, శస్త్ర చికిత్సలకు అనుకూలంగా లేకపోవడం ఇబ్బందిగా ఉంటోంది. అన్ని విభాగాల వైద్యులు ఉండడంతో ఇక్కడే మెరుగైన వైద్యం అందిస్తున్నా, రోగి పరిస్థితిని బట్టి మాత్రమే రెఫర్ చేస్తున్నాం.

– డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి, మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్

నీపై చర్యలు తప్పవు

- నేను సంతోష్‌ను కాదు..
- నీపై ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి..
- ఎన్నిసార్లు చెప్పాలి.. ఎందుకింత నిర్లక్ష్యం..?
- జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్‌పై కలెక్టర్ కుమార్ దీపక్ ఆగ్రహం



ప్రజావాణిలో డీఎం గోపాల్‌ను హెచ్చరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: "నీపై ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి.. నీకు ఎన్నిసార్లు చెప్పాలి.. ఎందుకింత నిర్లక్ష్యం.. నీకు ఇంకా సర్వీసు ఎంత ఉంది..? గతం నుంచి ఇంకా నీ తీరు మారదా..? నేను సంతోష్(గత కలెక్టర్)ను కాదు.. నీపై చర్యలు తప్పవు.." అంటూ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ గోపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజావాణి కార్యక్రమంలోనే ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో అక్కడే ఉన్న వివిధ శాఖల జిల్లా అధికారుల్లో ఆశ్చర్యంతోపాటు భయం పుట్టించింది. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు బి.రాహుల్, మోతిలాల్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. ముగింపు సమయంలో జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ గోపాల్‌ను పిలిచి సీఎంఆర్ వేగవంతానికి మిల్లర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఇప్పటికే ధాన్యం సేకరణలో, సీఎంఆర్‌పై ఫిర్యాదులు వచ్చాయని, అయినా ఎందుకింత నిర్లక్ష్యం చేస్తున్నారని నిలదీశారు. గతంలో ఇలాంటి నిర్లక్ష్యంతోనే చర్యలు తీసుకున్నా తీరు మారడం లేదని అన్నారు.

ఆకస్మిక తనిఖీలు.. అధికారులకు హెచ్చరికలు..

జిల్లా అధికారుల పనితీరు, జిల్లా స్థితిగతులు, అభివృద్ధి తీరుపై పట్టు ఉండడంతో ఆయా మండలాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులను హెచ్చరిస్తున్నారు.

న్యూస్‌రీల్

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

- గ్రామాల్లో పోలీసుల నైట్‌హాల్ట్
- రామగుండం సీపీ శ్రీనివాసులు



ఆస్నాదలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు

చెన్నూర్‌రూరల్: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. పోలీస్ మీ కోసం ఉంటుందనే నమ్మకం, భరోసా కల్పిస్తూ అసాంఘిక శక్తులను కట్టడి చేయడంతోపాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం రామగుండం కమిషనరేట్ పరిధిలోని గ్రామాల్లో పోలీస్ నైట్‌హాల్ట్ అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం మండలంలోని ఆస్నాద గ్రామంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్, ఎస్సైలు శ్వేత, వెంకటేశ్వర్‌రావులతో కలిసి నైట్‌హాల్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో విద్యార్థులతో మాట్లాడి నోటు పుస్తకాలు అందజేశారు. గ్రామస్తులతో మాట్లాడారు. మూఢనమ్మకాల నిర్మూలనపై తెలియజేశారు. గ్రామంలో సీసీ కెమెరాల పనితీరు తదితర అంశాలపై వివరించారు.

పార్లమెంటు సమావేశాలకు హాజరైన గడ్డం వంశీకృష్ణ



సహచర ఎంపీలతో ఎంపీ గడ్డం వంశీకృష్ణ

మంచిర్యాలటౌన్/చెన్నూర్: తొలిసారి ఎంపీగా పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి గెలిచిన గడ్డం వంశీకృష్ణ సోమవారం పార్లమెంటు సమావేశాలకు హాజరయ్యారు. 18వ లోక్‌సభ తొలి సమావేశాలు నిర్వహించగా, సహచర ఎంపీలు అనిల్‌కుమార్‌యాదవ్, రఘువీర్‌రెడ్డి, రఘురాంరెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఢిల్లీలో వంశీకృష్ణకు చెన్నూర్ కాంగ్రెస్ నాయకులు హిమవంతరెడ్డి, బషీర్, శ్రీధర్‌పటేల్, మల్లికార్జున్‌గౌడ్ స్వాగతం పలికారు.

రేషన్ ఈకేవైసీ గడువు పొడగింపు

దండేపల్లి: రేషన్‌కార్డులకు ఆధార్ అనుసంధానం గడువును మరోసారి పొడగించారు. ఈ నెల 30 ఆఖరు తేదీ కాగా, ఆధార్ అనుసంధాన ప్రక్రియ పూర్తి కాకపోవడంతో సెప్టెంబర్ నెలాఖరు వరకు అవకాశం కల్పించారు. ఒక దేశం–ఒక రేషన్‌కార్డు అన్న విధానంలో భాగంగా రేషన్‌కార్డుకు ఆధార్ అనుసంధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. వినియోగదారులు రేషన్ దుకాణంలో ఈ–పాస్ యంత్రం ద్వారా ఈకేవైసీ చేసుకునేందుకు పలు దఫాలుగా అవకాశం కల్పించింది. అయినా జిల్లాలో ఇప్పటి వరకు ఈకేవైసీ 74శాతం మాత్రమే పూర్తయింది. వంద శాతం పూర్తి చేయాలని రేషన్ డీలర్లకు అధికారులు ఆదేశాలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 2,19,162 రేషన్ కార్డులు ఉండగా, అందులో 6,38,553 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో ఇప్పటి వరకు 4,75,914 మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారు. ఇంకా 1,62,639 మంది ఈకేవైసీ పూర్తి చేసుకోవాల్సి ఉంది. ఆధార్‌కార్డులకు ఫోన్ నంబరు లింక్ లేకపోవడం, వేలిముద్రలు పడకపోవడం, ఆధార్ కార్డుకు ఫోన్ నంబరు లింక్ చేసుకోవడంలో జాప్యం, తదితర కారణాలతో ఈకేవైసీలో జాప్యం జరుగుతోంది.

సికిల్‌సెల్ నిర్మూలనకు కృషి చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: సికిల్‌సెల్‌ను పూర్తి స్థాయిలో నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి జయ అన్నారు. సోమవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్‌లోని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి సర్వేశ్వర్ రెడ్డి, వైద్య, ఆరోగ్య కార్యదర్శి అమర్‌సింగ్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, వైద్యాధికారులతో సికిల్‌సెల్ నిర్మూలనపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకం కింద సికిల్‌సెల్ బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులు ప్రతీరోజు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై వివరించాలని తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని 149 ఉపకేంద్రాలు, 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలలో, ఆశ కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

అర్జీలు పెండింగ్ ఉండకూడదు



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: సీఎం ప్రజావాణి నుంచి వచ్చిన అర్జీలు, జిల్లా ప్రజావాణిలో అందిన అర్జీలు పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు బి.రాహుల్, మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణలతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 50 దరఖాస్తులు అందాయని, అధికారులు పరిష్కరించాలని సూచించారు.

- మంచిర్యాల పట్టణానికి చెందిన గాజుల రజిత గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల దరాఖస్తుల్లో సవరణకు అవకాశం కల్పించాలని కోరింది.
- పాత మంచిర్యాలకు చెందిన అల్లి లచ్చయ్య తనకు చెందిన వేంపల్లి శివారులోని పట్టా భూమిలో అనుమతి లేకుండా 12 విద్యుత్ స్తంభాలు వేశారని, వ్యవసాయ పనులకు ఇబ్బందిగా ఉన్నందున తొలగించాలని కోరాడు.
- హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన అల్లి పరమేష్ తన భూమిలో పైప్‌లైన్, రోడ్డు నిర్మాణం జరిగిందని, ఇంట్లో ఒకరికి మున్సిపల్ ఉద్యోగం, నష్టపరిహారం ఇస్తామని ఇవ్వలేదని, ఇప్పించాలని విన్నవించాడు.

బలవంతంగా టీసీ ఇచ్చారు..



నా కుమారుడు జాడి సాయిచరణ్ కోటపల్లిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సీ పాఠశాలలో చదువుతున్నాడు. నా కూతురుకు సికిల్ సెల్ వ్యాధి ఉంది. కుమారుడికి కూడా వ్యాధి ఉందని బలవంతంగా లెటర్ రాయించుకుని టీసీ ఇచ్చారు. మా కుమారుడిని తిరిగి పాఠశాలలో చేర్చుకోవాలి.

– జాడి జ్యోతి, గ్రామం: చామన్‌పల్లి, మం: జన్నారం

విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన



హరితహారం కార్మికులు, సీఐటీయూ నాయకులు

బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఆకస్మికంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రంజిత్, కార్మికులు ఎం.వనజ, కే.మంగ మాట్లాడుతూ ఐదేళ్లుగా పట్టణ ప్రగతి, హరితహారం మొక్కలు నాటడం, సంరక్షణ, నర్సరీ పెంపకం పనుల్లో 15మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. డిసెంబర్, జనవరి నెలల వేతనాలు ఇవ్వలేదని, ఫిబ్రవరిలో తొలగించారని అన్నారు. కొత్తవారిని పనుల్లోకి తీసుకుంటున్నట్లు తెలుస్తోందని అన్నారు. కార్మికులు లావణ్య, లత, రామక్క, పి.రాధ, భాగ్య, శారద, నీల, రేణుక, వెంకటేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

త్రిచక్ర వాహనం అందించాలి



పూర్తిగా నడవలేక దివ్యాంగుడినైనా నాకు ప్రభుత్వం నుంచి త్రిచక్ర మోటార్‌సైకిల్ అందించాలి. బతికేందుకు ఏదైనా షాపులో కూర్చుని పని చేసేందుకు ఇంటి నుంచి వెళ్లి రావడానికి వీలవుతుంది.

– అడ్ల కుంట నగేష్, చెన్నూర్

సమస్యలు పరిష్కరించాలి



అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్, నాయకులు

అంగన్వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26 వేలు, హెల్పర్లకు రూ.21 వేలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, కలిందర్ అలీఖాన్, మిట్టపల్లి పౌల్, కృష్ణ, పద్మ, రాజు, స్వర్ణలత, విజయ, ఏసుమణి, అనసూయ, శిరీష, వసుంధర, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిలో ఎన్నికలు నిర్వహించాలి



ఎన్నికల సాధన జేఏసీ నాయకులు

మందమర్రిలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని మందమర్రి ఎన్నికల సాధన జేఏసీ నాయకులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మందమర్రిలో పాలకవర్గం లేక కొన్నేళ్లుగా పాలన అస్తవ్యస్తంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎన్నికలు నిర్వహించి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రమేష్, అరుణ్, శ్రీనాథ్ చారి, రామంచ తిరుపతి, ముజాహిద్, బీమ్‌సేన్ శేఖర్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీలో మెరుగైన ఫలితాలు

మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు సోమవారం వెల్లడయ్యాయి. జిల్లా విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరంలో 70.22శాతం, సెకండియర్‌లో 66.49శాతంతో మెరుగైన ఫలితాలు సాధించారు. మే 24నుంచి జూన్ 3వరకు పరీక్షలు నిర్వహించారు. ఇందులో మొదటి సంవత్సరంలో 3,563 మంది విద్యార్థులకు గాను 2502 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరంలో 2,226 మంది విద్యార్థులకు గాను 1480 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విద్యార్థులు 404 మందికి గాను 239 మంది పాసయ్యారు. సెకండియర్‌లో 411 మందికి గాను 252 ఉత్తీర్ణత సాధించారని డీఐఈవో శైలజ తెలిపారు.

అదనపు కలెక్టర్ రాహుల్ బదిలీ

- జిల్లాలో తనదైన ముద్ర
- విద్యార్థులు, నిరుద్యోగులపై దృష్టి



జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్ బదిలీ అయ్యారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ఆయనను భద్రాచలం జిల్లా ఐటీడీఏ పీవోగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన అదనపు కలెక్టర్‌గా మొదటి పోస్టింగ్‌పై 2022 నవంబర్ 9న జిల్లాకు వచ్చారు. జిల్లాలో పని చేసిన 18నెలల పాలన కాలంలో రాహుల్ తనదైన ముద్ర వేశారు. పల్లె ప్రగతి, పట్టణప్రగతి పనులపై ఆకస్మికంగా తనిఖీ చేపట్టి అభివృద్ధికి కృషి చేశారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బెల్లంపల్లి రిటర్నింగ్ అధికారిగా విధులు నిర్వర్తించి ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. పదో తరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక అవగాహన సదస్సులు, పోటీ పరీక్షలు నిర్వహించారు. ప్రేరణ అవర్నెస్ అండ్ మోటివేషన్ కార్యక్రమాలు, విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉత్తరాలు రాసి ఆశ్చర్యపరిచారు.

నిరుద్యోగులకు అండగా..

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకున్నారు. గ్రంథాలయాల మరమ్మతులు, వసతులు కల్పించడం, పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచడం, వైఫై సేవలు వంటి చర్యలు చేపట్టారు. గ్రంథాలయాల్లో నిరుద్యోగులకు సూచనలు చేయడం, గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న 250 మందికి, డీఎస్సీకి సిద్ధమవుతున్న వారికి ఏఎస్‌కే ప్రైవేట్ ఇనిస్టిట్యూట్, ఎస్‌అండ్‌ఎస్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా ఉచితంగా ఆన్‌లైన్ టెస్టులు నిర్వహించారు. 400 మంది వరకు పోటీ పరీక్షల పుస్తకాలు, ఆన్‌లైన్ టెస్ట్ సిరీస్‌ల ద్వారా పరీక్షలకు సిద్ధం చేశారు.

ఆకట్టుకున్న కవిత

జిల్లా సమీకృత కలెక్టరేట్ ప్రారంభం సందర్భంగా తెలంగాణ ఏర్పాటు, అభివృద్ధి సాధించిన తీరు, తెలంగాణలోని ముఖ్యకట్టడాలు, తదితర అంశాలను పొందుపరుస్తూ రాసిన కవిత ప్రజలు, అధికారులను ఆకట్టుకుంది. ఎన్నికల సమయంలో నూతన ఓటర్లను ప్రోత్సహించేందుకు ప్రత్యేక పాట రాసి తెలంగాణ సాంస్కృతిక కళాకారులతో పాడించారు.

అందరి సహకారంతోనే..

జిల్లాలో ఎన్నికలతోపాటు పట్టణ, పల్లెప్రగతి, గ్రంథాలయాలు అభివృద్ధి జరిగింది. చదువుతోనే ఏదైనా సాధించవచ్చని విద్యార్థులు, తనలాగా కష్టపడి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని నిరుద్యోగులను ప్రోత్సహించాను. నా మొదటి పోస్టింగ్ ద్వారా జిల్లాకు రావడం మరువలేనిది. నా ఉద్యోగ ప్రయాణంలో జిల్లా ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

– జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్

మిషన్ పరివర్తన సమర్థవంతంగా నిర్వహించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో మాదకద్రవ్యాలు, గంజాయి, మత్తు పదార్థాలను నిరోధించడంలో భాగంగా మిషన్ పరివర్తన కార్యక్రమాన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, ఎక్సైజ్ శాఖ అధికారి నందగోపాల్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చందన, జిల్లా విద్యాధికారి యాదయ్యలతో కలిసి మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల విక్రయం, వినియోగాల నిరోధం, మిషన్ పరివర్తన కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా మద్యం, సిగరెట్లు, మాదక ద్రవ్యాలను విక్రయించే వారి దుకాణాలు సీజ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరావు, గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనిత తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన పాముకు చికిత్స



చికిత్స చేస్తున్న పశువైద్య సిబ్బంది

బెల్లంపల్లిరూరల్: మండలంలోని కాశిరెడ్డిపల్లెలో గాయపడిన పాముకు పశువైద్యాధికారులు పావని, దిలీప్‌లు సోమవారం చికిత్స చేశారు. రైతు ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా పాము తలకు గాయమైంది. గమనించిన రైతు బెల్లంపల్లిలో పాములు పట్టే వారికి సమాచారం అందించాడు. దీంతో వారు అక్కడికి చేరుకుని గాయపడిన పామును బెల్లంపల్లి మండల పశువైద్యశాలకు తీసుకెళ్లారు. బెల్లంపల్లి, నెన్నెల పశువైద్యాధికారులు చికిత్స అందించారు. పాము ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడడంతో బెల్లంపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. పాముకు చికిత్స అందించిన వైద్య సిబ్బందిని పలువురు అభినందించారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా.. ఒకరికి గాయాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామ పరిధిలోని రాంపూర్‌కు చెందిన పెరుగు రాజేందర్ సోమవారం తన పంటచేనులో ట్రాక్టర్‌తో దున్నుతుండగా అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం మెరుగ్గా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

భూ వివాదంలో ఐదుగురిపై కేసు

నెన్నెల: మండలంలోని నందులపల్లిలో గంట అజయ్ అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన జంబి పోశం, జంబి లచ్చన్న, జంబి బానక్క, జంబి చుక్కల జంబి ప్రదీప్ సోమవారం దాడి చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. గ్రామ శివారులో కోర్టులో కేసు నడుస్తున్న భూమిలో ట్రాక్టర్‌తో దున్నకూడదని గంట అజయ్ వాదించగా అతడిపై ఐదుగురు దూషిస్తూ దాడి చేశారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

కోటపల్లి: పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని షెట్‌పల్లి గ్రామానికి చెందిన పుప్పాల మల్లయ్య (65) కుమారుడు ఏడాది క్రితం, రెండునెలల క్రితం భార్య మృతి చెందారు. దీంతో మనస్తాపానికి గురైన మల్లయ్య సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

కోటపల్లి: మండలంలోని పంగిడిసోమారంలో సోమవారం పోలీసు, వ్యవసాయ శాఖ అధికా రులు సంయుక్తగా దాడులు నిర్వహించి 83 కి లోల లూజ్ పత్తి విత్తనాలు సీజ్ చేసినట్లు ఏవో మహేందర్, ఎస్సై రాజేందర్ తెలిపారు. త మకు అందిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన కోల కుమార్ ఇంట్లో తనిఖీలు నిర్వహి ంచగా 83 కిలోల నకిలీ పత్తి విత్తనాలు లభించినట్లు తెలిపారు. నిందితుడిని పోలీస్ స్టేష న్‌కు తరలించి విచారించగా దోరప్పనేని శ్రీని వాస్‌రావు అనే వ్యక్తి నుంచి విత్తనాలు తెచ్చి నట్లు ఒప్పుకున్నాడు. దీంతో కుమార్‌తో పాటు శ్రీనివాస్‌రావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాజుకుమార్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్లు ఇవ్వాలి

మంచిర్యాలటౌన్: తలసేమియా, సికిల్ సెల్, హిమోఫిలియా వ్యాధిగ్రస్తులందరికీ సదరం సర్టిఫికెట్ ఇవ్వాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందించినట్లు అందించినట్లు తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్ తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు, మానవ హక్కుల కమిషనర్‌ను కలిసి విన్నవించినా చర్యలు లేవన్నారు.

పొలాల్లో మృత్యుపాశాలు

పంట పొలాల్లో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ తీగలు అన్నదాతల పాలిట శాపంగా మారుతున్నాయి. వంగిన స్తంభాలు, వేలాడుతున్న తీగలు రైతులను కలవర పెడుతున్నాయి. ఏటా రైతులతో పాటు మూగ జీవాలు సైతం పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో అన్నదాతలు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. కోటి ఆశలతో సాగు మొదలుపెడుతున్న అన్నదాతలను పంట పొలాల్లో వంగిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలు, కంచెలు లేని టాన్స్‌ఫార్మర్లు భయందోళనకు గురిచేస్తున్నాయి.

- ప్రమాదకరంగా వంగిన స్తంభాలు
- వేలాడుతున్న విద్యుత్ తీగలు
- విద్యుదాఘాతంతో మూగజీవాల మృత్యువాత
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు


కన్నెపెల్లి మండలం కొత్తపల్లి శివారులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం వద్ద విత్తనాలు వేస్తున్న కూలీలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలతో రోజూ ఎక్కడో ఒకచోట మూగ జీవాలు ప్రాణాలు కోల్పోతున్నా రైతులు ప్రమాదాలకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. వ్యవసాయంలో రైతుకు వెన్నుదన్నుగా నిలిచే వేలాది రూపాయల విలువైన కాడెడ్లు, ఆవులు, గేదెలు, మేకలు విద్యుత్‌షాక్‌తో మృతి చెందుతుండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. జిల్లాలోని చాలా గ్రామాల్లో పంటచేలలో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. స్తంభాలు ఒకవైపుకు వంగి ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులే మరమ్మతులు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం చేనుకు వెళ్లాలంటే జంకుతున్నారు. కొన్ని గ్రామాల్లో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలకు గత్యంతరం లేక కర్రలను పాతి సపోర్ట్‌గా ఉంచుతున్నారు.


బెల్లంపల్లి మండలంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మూడు గేదెలు (ఫైల్)

ప్రమాదకరంగా వైర్లు

పంటచేలలో బోరుబావుల తవ్వకాలు పెరిగాయి. గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలు పెరిగాయి. ఇటీవల ప్రకృతి విలయాలు, తుపాన్ కారణంగా ఆ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉందోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

ఇటీవలి కొన్ని ఘటనలు

- ఈ నెల 20న భీమారం మండలం కొత్తగూడెం గ్రామ సమీపంలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరుకు తగలడంతో బూపల్లి లచ్చన్న, పల్ల శ్రీనివాస్‌కు చెందిన రెండు పశువులు మృతి చెందాయి.
- ఈ నెల 18న బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామ శివారులోని పంటచేలలో విద్యుత్ తీగలు తెగిపడడంతో అటుగా మేతకు వెళ్లిన మూడు గేదెలు వాటిని తాకడంతో మృతి చెందాయి.
- గత నెలలో దండేపల్లి మండలం కన్నెపల్లి గ్రామ శివారులోని పంట పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకి దున్నపోతు మృతి చెందింది.

సీజన్ ముందు పట్టింపేది?

ఏటా యాసంగి సీజన్ ముగిసి వానాకాలం సాగుకు ముందు మే నెలలో పంటచేలన్నీ బీడుభూములుగా ఉంటాయి. ఆ సమయంలో పొలాల్లో కిందకు వేలాడుతున్న కరెంట్ తీగలను, వంగిన స్తంభాలను సరిచేయాల్సిన అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మేలో మరమ్మతుల పేర పదిరోజుల పాటు గ్రామాలు, పట్టణాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసి కొన్నిచోట్ల మాత్రమే మరమ్మతులు చేపట్టారు. పంట పొలాలు, మైదాన ప్రాంతాల్లో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన స్తంభాలను సరిచేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో గాలివాన బీభత్సానికి విద్యుత్ తీగలు తెగిపోవడంతో మేతకు వెళ్లిన మూగజీవాలు వాటిని తాకి మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పొలాల్లో ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, విద్యుత్ తీగలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

స్తంభాలు సరిచేయాలి

పంటచేలలో ఒకేవైపునకు వంగి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు కూలిపోతాయోనని భయంగా ఉంది. కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన స్తంభాలు సరిచేయాలి. భయంతో విద్యుత్ తీగల కింద దుక్కులు దున్నలేకపోతున్నాం. వర్షాకాలం అనేక ఇబ్బందులు పడుతున్నాం.

– సీహెచ్ బాపు, కొత్తపల్లి, కన్నెపెల్లి మండలం

ప్రమాదాల నివారణకు చర్యలు

పంటచేలలో వంగిన స్తంభాలు, లూజుగా ఉన్న విద్యుత్ తీగలు సరిచేస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేస్తున్నాం. కురుస్తున్న వర్షాలకు భూమి మెత్తబడి కొన్నిచోట్ల స్తంభాలు వంగిపోతున్నాయి. రైతులు ఫొటోలు తీసి పంపించడంతో వెంటనే సంబంధిత ఏఈలు వెళ్లి మరమ్మతులు చేపడుతున్నారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రావణ్‌కుమార్, జిల్లా విద్యుత్ శాఖ అధికారి (ఎస్ఈ)

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: కార్మికులు గైర్హాజరు లేకుండా పనిచేయాలని ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలోని సమావేశం మందిరంలో గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గతేడాది నిర్ణీత మస్టర్లు చేయని ఆర్కే, ఆర్కే న్యూటెక్ గని కార్మికులకు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం పురుషోత్తం రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్‌బాబు, అధికారులు రాజేశ్, సంతన్, సృజన్, తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ చెల్లించాలని టవరెక్కిన కార్మికుడు

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో పనిచేస్తున్న బి.మధు అనే కాంట్రాక్టు కార్మికుడు తనకు రావాల్సిన పీఎఫ్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పెగడపల్లి సమీపంలో సోమవారం టవరెక్కి హల్‌చల్ చేశాడు. ఎస్టీపీపీలోని పవర్‌మేక్ కంపెనీలో ఆరేళ్లుగా పని చేస్తున్నప్పటికీ పీఎఫ్ డబ్బులు చెల్లించడం లేదని, అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ పట్టించుకోవడంలేదన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు పవర్‌మేక్ కంపెనీ అధికారులకు తెలుపగా సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడితో మాట్లాడారు. సమస్య పరిష్కరిస్తానని నచ్చజెప్పడంతో కిందకు దిగాడు. కాగా మధు ఇదే ఏడాది మార్చిలో కూడా పీఎఫ్ డబ్బులు చెల్లించాలని టవర్ ఎక్కి ఆందోళన చేపట్టాడు.

సింగరేణికే గనులు కేటాయించాలి




మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: తెలంగాణలోని నూతన బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని ఐఎన్టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ మనుగడ సాధించాలంటే తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణికి అప్పగించాలన్నారు. బీజేపీ విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇప్పటికే 9 విడతలుగా బొగ్గు గనులను వేలం వేసి అమ్మేశారని, ఇప్పుడు 10వ విడతలో సింగరేణిలోని శ్రావణ్‌పల్లి గనిని కూడా వేలానికి వేయడం అభ్యంతరకరమన్నారు. దీనిపై ఐఎన్టీయూసీ పోరాడుతుందన్నారు. ఈ గనిని సింగరేణి కేటాయించాలని యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారన్నారు. సమావేశంలో ఆ యూనియన్ జాతీయ సమితి సభ్యులు భీంరావు, సెంట్రల్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, నాయకులు తిరుపతి రాజు, లాగల శ్రీనివాస్ కొలిపాక సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: రాష్ట్రంలోని నూతన బొగ్గు గనులను ఎలాంటి టెండర్ ప్రక్రియ లేకుండా సింగరేణికే కేటాయించాలని ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొగ్గు గనులను దక్కించుకోవడానికి ఎలాంటి ఉద్యమాలకైనా సింగరేణి ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు భూమయ్య, నాయకులు నరేందర్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీశాఖ అధికారుల సమీక్ష


సమీక్షలో పాల్గొన్న అధికారులు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల ఆదాయపన్నుపై ఐటీశాఖ అధికారులు సోమవారం సింగరేణి అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉద్యోగులు ఆదాయ పన్ను రిటర్న్స్ కోసం సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్నారు. తప్పుడు పత్రాలు సమర్పిస్తే శాఖ పరమైన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవిందరావు, అధికారులు దేవేందర్ రెడ్డి, రాజేశ్వర్, పాలకుర్తి రాజు, కాంతారావు, సృజన్, గౌస్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట–1 గనిని సందర్శించిన జీఎం


గనిపై అధికారులతో జీఎం మనోహర్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–1 గనిని సోమవారం ఏరియా జీఎం మనోహర్ సందర్శించారు. ఈ సందర్భంగా గని ప్లాన్‌లు, 3ఎస్ 10 స్టోరింగ్ ప్యానెల్, వివిధ పని స్థలాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమష్టి కృషితో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. కేకే గ్రూపు ఏజెంట్ రామదాసు, గని మేనేజర్ భూశంకరయ్య, ఏరియా ఇంజనీర్ రాంప్రసాద్, అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రిలో ఐదేళ్ల చిన్నారి మృతి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ కాలనీకి చెందిన ఇగురపు లోహిత (5) పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన ఇగురపు హరీశ్ కుమార్తె లోహితకు ఆదివారం రాత్రి వాంతులు కావడంతో పట్టణంలోని పిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు చికిత్స ప్రారంభించిన కొద్దిసేపటి అనంతరం చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో కాగజ్‌నగర్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యం వికటించడంతోనే మృతి చెందిందని ఆరోపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని నచ్చజెప్పినా వినకపోవడంతో అర్ధరాత్రి వరకు ఆందోళన కొనసాగింది. చివరకు నష్టపరిహారం చెల్లిస్తామని ఆస్పత్రి యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించినట్లు సమాచారం.

చికిత్స పొందుతూ యువకుడు ..

ఆసిఫాబాద్‌రూరల్: ఈ నెల 10న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోవింద్‌పూర్ గ్రామానికి చెందిన లోకండె మురళీకృష్ణ (22)ఈ నెల 10న ఇంట్లో పురుగుల మందు తాగడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు.

కుక్కను చంపిన వ్యక్తిపై కేసు

నస్పూర్: శునకాన్ని అత్యంత కిరాతకంగా కత్తితో పొడిచి చంపిన వ్యక్తిపై జంతు సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. నస్పూర్ పట్టణంలోని సీసీసీ కార్నర్ గాయత్రి నగర్‌కు చెందిన పందుల పెంపకం యజమాని సమ్మయ్య తన పందులపై వీధి కుక్క దాడి చేసేందుకు యత్నిస్తుందని ఈ నెల 22న కత్తితో పొడిచి చంపాడన్నారు. ఈ విషయమై స్థానిక జంతు పరిరక్షణ కార్యకర్త గౌతం (ఎన్‌జీఓ) సోమవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దరోగపల్లిలో 'పోడు' వివాదం

- రైతును అదుపులోకి తీసుకునేందుకు అటవీ అధికారుల యత్నం
- అడ్డుకున్న కుటుంబ సభ్యులు
- పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఇరువర్గాలు


రైతును లాక్కెళ్తున్న అధికారులు, అడ్డుకుంటున్న కుటుంబ సభ్యులు

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ మండలం దరోగపల్లి గ్రామంలో పోడు వివాదం తలెత్తింది. డంబిరె సుధాకర్ అనే రైతు గ్రామ సమీపంలోని పోడు భూమిలో పత్తి విత్తనాలు విత్తుకునేందుకు సోమవారం సాగు పనులు ప్రారంభించాడు. అటవీ భూముల్లోకి అక్రమంగా చొరబడి సాగు పనులు చేస్తున్నాడని సాయంత్రం ఫారెస్టు అధికారులు సుధాకర్ ఇంటికి చేరుకున్నారు. సుధాకర్‌ను అదుపులోకి తీసుకునే క్రమంలో కుటుంబ సభ్యులు పెంటయ్య, అంజక్క, శ్రీనివాస్, రేఖ.. బీట్ అధికారులు అరవింద్, వంశీ, సతీష్ మధ్య తోపులాట జరిగింది. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూముల్లో సాగును అడ్డుకోవడం ఏంటని కుటుంబ సభ్యులు ఎదురుతిరిగారు. సుమారు అరగంట వాగ్వాదం జరిగింది. మహిళలు అని చూడకుండా దాడి చేశారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అటవీశాఖ అధికారులపై రైతు సుధాకర్ ఫిర్యాదు చేయగా.. విధులకు ఆటంకం కలిగిస్తూ అటవీ భూముల్లో సాగు పనులు చేపట్టాడని అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎస్సై కొమురయ్యను వివరణ కోరగా.. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఐటీడీఏ ఎదుట ఆదివాసీల ధర్నా


ఐటీడీఏ ఎదుట బైఠాయించిన ఆదివాసీలు

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాల్లో అనేక ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట ఆదివాసీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపూరావు మాట్లాడుతూ లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, షెడ్యూల్డ్ ప్రాంతంలో మెగా డీఎస్సీ ఏర్పాటు చేయాలని, ఐటీడీఏలో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, జీవో 3ను యథావిధిగా కొనసాగించాలని, పోడుభూములు సాగుచేసుకుంటున్న ఆదివాసీ రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, 1/70, పెసా, అటవీ హక్కుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. 5 వ షెడ్యూల్డ్ ప్రాంతంలో జీవో 317 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్వరాష్ట్రంలోనైనా ఆదివాసీలకు న్యాయం జరుగుతుందనే ఆశతో ఉన్న తమకు అన్ని విభాగాల్లో అసంతృప్తి ఎదురవుతుందన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తాకు అందజేశారు. పీవో మాట్లాడుతూ ఐటీడీఏ మీదేనని, ఏ సమస్య ఉన్నా నేరుగా కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. తనతో సాధ్యమైన డిమాండ్లను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆదివాసీలు, సంఘాల నాయకులు శాంతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బుర్ర పోచ్చయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్, నాయకులు తిరుపతి, కుమ్ర శ్యాంరావు, నగేశ్, జంగు, విజయ్, గోపీచంద్, రేణుక, పుష్పరాణి, తదితరులు పాల్గొన్నారు.

హైవేలో భూములు పోకుండా చూడాలి

మంచిర్యాలటౌన్: హైవేలో భూములు పోకుండా చూడాలని నేషనల్ హైవే 63 రహదారి బాధిత రైతులు సోమవారం జిల్లా కేంద్రంలోని నేషనల్ హైవే పీడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ హైవే 63కు సంబంధించి అధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, మూడు అలైన్‌మెంట్లు మార్చి, మూడవ అలైన్‌మెంట్‌గా నోటిఫికేషన్‌ను జారీ చేసి రైతులను ఆగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 72 నోటిఫికేషన్ ద్వారా ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద భూములను కోల్పోయిన నిర్వాసితులైన రైతులు తిరిగి మరోసారి వారి భూములను కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. రెండుసార్లు భూములను కోల్పోవడం చట్టవిరుద్ధమని, తమ భూములను నేషనల్ హైవే అధికారులు తీసుకోవడాన్ని నేరంగా పరిగణించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కొందరు రాజకీయ దళారులతో చేతులు కలిపి బడా పెట్టుబడిదారుల కోసం, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లబ్ధి చేకూరేలా పాత అలైన్‌మెంట్‌ను మార్చారని ఆరోపించారు. బీజేపీ నాయకులు తుల మధుసూదన్‌రావు, రైతులు లగిశెట్టి రాజమౌళి, జనార్దన్ రెడ్డి, పెట్టం తిరుపతి, తిప్పని మల్లేశ్, గొల్ల తిరుపతి, మంచిగట్ల మల్లేశ్, ఎమ్మార్పీఎస్ నాయకులు బోస్, బీసీ ఐక్య వేదిక నాయకులు గుమ్ముల శ్రీనివాస్, వడ్నాల శ్యాం, కొండల్ రెడ్డి, అల్లి పరమేశ్, అల్లి లక్ష్మీ, స్వచ్ఛంద పారిసేవా సంస్థ అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య, సోమరాములు పాల్గొన్నారు.

తండ్రిని కొట్టిన తనయుడికి జైలు

బెల్లంపల్లిరూరల్: మద్యం సేవించడానికి పెన్షన్ డబ్బులు ఇవ్వనందుకు తండ్రిపై దాడి చేసిన తనయుడికి కోర్టు ఆరునెలల జైలుశిక్ష విధించింది. కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గుమ్ముల శ్రీనివాస్ మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 15న మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వాలని తండ్రి మల్లయ్యపై కర్రతో దాడి చేశాడు. మల్లయ్య తాళ్ల గురిజాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సోమవారం నిందితుడిని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పర్చగా జడ్జి ముఖేష్ సాక్షులను విచారించి ఆరు నెలల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై జి.నరేష్ తెలిపారు.

మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిని పట్టుకున్న రైల్వే పోలీసులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని సోమవారం జీఆర్‌పీ పోలీసులు పట్టుకున్నారు. బెల్లంపల్లి మండలం మాల గురిజాల గ్రామానికి చెందిన కోనూరి స్వామి కొద్దిరోజులుగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. కొంతకాలం హిజ్రాగా తిరిగిన స్వామి మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లి పోయాడు. రైల్వేస్టేషన్ శివారులో తిరుగుతుండగా జీఆర్‌పీ పోలీసులు పట్టుకున్నారు. అతని ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో 108లో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఇంటికి తీసుకెళ్లారు.

ప్రతీ ఉద్యోగి క్రమశిక్షణతో పనిచేయాలి


నియామక పత్రాలు పొందిన అభ్యర్థులు

శ్రీరాంపూర్: సింగరేణిలో ప్రతీ ఉద్యోగి క్రమశిక్షణతో పని చేయాలని శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. సోమవారం శ్రీరాంపూర్‌లో 102 మందికి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం దొరకడం అదృష్టంగా భావించాలన్నారు. ఇప్పటివరకు శ్రీరాంపూర్‌లో 3,424 మందికి కారుణ్య ఉద్యోగాలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, డీజీఎం పర్సనల్ రవీందర్‌రావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సీనియర్ పీవో కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.